'పది'లో సత్తా చాటిన శ్రీచైతన్య విద్యార్థులు

మేడ్చల్ రూరల్: పదవ తరగతి ఫలితాల్లో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించగా,12 మంది 9.8జీపీఏ, 21 మంది విద్యార్థులు 9.7 జీపీఏ తో పాటు 100కు పైగా విద్యార్థులు 9.0 జీపీఏ తో ఉత్తీర్ణత సాధించారు. గురువారం గుండ్లపోచంపల్లిలోని కొంపల్లి-4 శ్రీచైతన్య బ్రాంచ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఏజీఎం రమణారావు విద్యార్థులను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు జైపాల్‌రెడ్డి, సీతారాంరెడ్డి, ప్రిన్సిపాల్ రమేశ్,డీన్ చంద్రశేఖర్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

నేటి నుంచి చీర్యాల శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



చీర్యాల దేవాలయంలో కొలువైన లక్ష్మీనృసింహస్వామి



విద్యుద్దీపాల వెలుగులో చీర్యాల దేవాలయం

కీసర: శ్రీ చీర్యాల లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ చైర్మెన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్‌లు తెలిపారు. శుక్రవారం నుండి 6వ తేదీ వరకు బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మూడు రోజుల పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేశామన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి



ఓటు విలువ తెలుపుతున్న మహిళా సమాఖ్య సభ్యులు

మేడ్చల్: ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ పార్లమెంట్ ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకోవాలని మహిళా సమాఖ్య సభ్యులు, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ శేఖర్ అన్నారు. మండల మహిళా సమాఖ్యలో నిర్వహించిన సమావేశంలో ఓటు హక్కుపై అవగాహన కలిపించారు. గ్రామాలలో ఓటింగ్ శాతం పెంచెందుకు మహిళా సమాఖ్య సభ్యులు కృషి చేయాలని కోరారు. మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శ్రీలత, సిబ్బంది పాల్గొన్నారు.

పతంజలియోగా సమితి హోమం



మేడ్చల్: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో పతంజలియోగ సమితి , స్వాభిమాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పంచ కుండీయ దేవ యజ్ఞం నిర్వహించారు. లోక కళ్యాణం కోసం యజ్ఞం నిర్వహించినట్లు నిర్వహకులు తెలిపారు. మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్, ఆలయ ఫౌండర్ నందారెడ్డి, మాజీ జెడ్పీటీసీ శైల జహరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రచార హోరు

- ఎన్నికల వేళ జోరుగా ప్రచారం
- నాయకుల ఎత్తులు.. పైఎత్తులు
- కండువాలు మార్చుకుంటున్న నాయకులు
- విజయం కోసం ఎవరికి వారే ఆరాటం

ఎన్నికల రోజు సమీపిస్తున్న కొద్దీ ప్రచారం వేడెక్కుతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు నువ్వా.. నేనా అన్నట్లు ప్రచారం చేస్తున్నారు. సభలు, సమావేశాలు నిర్వహిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థులు రోడ్‌షోలు నిర్వహిస్తూ గెలిపించాలని కోరుతున్నారు.

కాంగ్రెస్

సంక్షేమ పథకాలు అందించే కాంగ్రెస్‌ను గెలిపించండి



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డి

కీసర: రాజ్యాంగం మార్చే పార్టీని ఓడించి సంక్షేమ పథకాలు అందించే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని మల్కాజ్‌గిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి ప్రజలను కోరారు. గురువారం కీసర, నాగారం మున్సిపాలిటీలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. మేడ్చల్‌జిల్లా అభివృద్ధి పథంలో నడవాలంటే రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌పార్టీతోనే సాధ్యమన్నారు. తాను జెడ్పీ చైర్మెన్‌గా ఉన్న సమయంలో ఇక్కడి ప్రాంతాల్లో కోట్లాది రూపాయలను వెచ్చించి పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. మాజీ కేంద్రమంత్రి సర్వే సత్యనారాయణ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్దిసుదీర్‌రెడ్డి, మేడ్చల్‌జిల్లా పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి నక్కాప్రభాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో మల్కాజిగిరిని అభివృద్ధి చేస్తామని మల్కాజ్‌గిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లో గురువారం నిర్వహించిన ర్యాలీ, కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. రెల్వేవంతెన పనులు పూర్తి చేస్తామని, ఘట్‌కేసర్ వరకు మెట్రో రైలు సౌకర్యం కల్పిస్తామని, ఇందిరమ్మ ఇళ్లు, రూ. 25 లక్షల రైతు బీమా అందిస్తామన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ వైస్ చైర్మెన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్ మాదిరెడ్డి పావని రెడ్డి, కిరణ్‌గుప్తాలు బీఆర్ఎస్‌పార్టీకి రాజీనామా చేసి గురువారం కాంగ్రెస్ పార్టీలోచేరారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ కాంగ్రెస్‌పార్టీ కండువాలుకప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బీఆర్ఎస్



కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులే గెలిపిస్తాయి

మేడ్చల్: కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులే బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డిని మల్కాజిగిరిలో గెలిపిస్తాయని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు దయానంద్‌యాదవ్, ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి అన్నారు. మండలంలోని డబీల్‌పూర్, నూతన్‌కల్ ,కోనాయిపల్లి గ్రామాలలో వారు స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు యూనుస్‌పాషా, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నూతన కమిటీ ఎన్నిక

మేడ్చల్: మండలంలోని శ్రీరంగవరం గ్రామ బీఆర్ఎస్ నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు దయానంద్‌యాదవ్ తెలిపారు. గ్రామ అధ్యక్షుడిగా బాలరాజు, ఉపాధ్యక్షుడిగా అశోక్, రవి, ప్రధాన కార్యదర్శిగా శంకర్, కార్యదర్శులుగా మాధవరెడ్డి, కోశాధికారిగా సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జనార్ధన్‌గౌడ్ తదితరులతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం



ఘట్‌కేసర్: కీసర 108 అంబులెన్స్ వైద్యసిబ్బంది అత్యవసర సమయంలో వైద్యం అందించి సాధారణ ప్రసవం చేశారు. మున్సిపాలిటీలోని కొండాపూర్‌కు చెందిన మేఘనను కీసర 108 సిబ్బంది ఈఎంటీ రవి, పైలట్ ఆంజనేయులు అంబులెన్స్‌లో నారపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్నారు. పరిస్థితి గమనించిన ఈఎంటీ రవి అత్యవసర విభాగం వైద్యుడిని సంప్రదిస్తూ వాహనంలోనే నార్మల్ డెలీవరీ చేశారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారు.

రేపు మేడ్చల్‌లో కేటీఆర్ రోడ్ షో



మేడ్చల్ లో రోడ్‌షో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 4వ తేదీన మేడ్చల్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షో నిర్వహిస్తారని ఎమ్మెల్యే మల్లారెడ్డి తెలిపారు. జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజుతో కలిసి మేడ్చల్ లో రోడ్ షో నిర్వహించతపెట్టిన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. జాతీయ రహదారి నుంచి పట్టణ వీధుల్లో రోడ్ షో నిర్వహించి వివేకానంద విగ్రహం వద్ద కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

బీజేపీ

బీజేపీ ఇంటింటి ప్రచారం

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులలో, మండలంలోని డబీల్‌పూర్, ఎల్లంపేట్, బర్మాజీగూడ, లింగాపూర్, నూతన్‌కల్, గౌడవెళ్ళి, శ్రీరంగవరం గ్రామాల్లో బీజేపీ నాయకులు ప్రచారం జోరుగా సాగించారు. ఎంపీ అభ్యర్థి ఈటెల రాజెందర్‌కు ఓటు వేయాలని కోరుతూ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు జగన్‌గౌడ్, నరెందర్‌రెడ్డి, పోచయ్య, ప్రేందాస్, శ్రీకాంత్, వంశీ వంజరి తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: దేశంలోని పేదలకు ఉచిత బియ్యం అందజేస్తున్న మోదీ ప్రభుత్వాన్ని మూడో సారి గద్దెనెక్కించడానికి బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు విప్పర్ల హనుమాన్ అన్నారు. మున్సిపాలిటీలో బీజేపీ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి రామతీర్థతో కలిసి ఆయన గురువారం ప్రచారం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ అభివృద్ధిని గాలికొదిలేశారన్నారు.

పలువురి చేరిక

కీసర: నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు గురువారం బీజేపీలో చేరారు. వారికి మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ కండువాలుకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు, చంద్రమౌళి, శ్రీనివాస్, ఎరుకల కరుణాకర్, పాల్గొన్నారు.

పోచారం: బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీజేపీ పోచారం మున్సిపాలిటీ అధ్యక్షుడు సురేష్ నాయక్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎంపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. యువమోర్చా అధ్యక్షుడు విశ్వ జాదవ్ పాల్గొన్నారు.



ఈటల సమక్షంలో బీజేపీలో చేరుతున్న నాయకులు



లింగాపూర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు



ఘట్‌కేసర్‌లో ప్రచారం చేస్తున్న మున్సిపల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి హనుమాన్, రామతీర్థ



పార్టీలో చేరుతున్న నాయకులు

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎన్నికల పరిశీలన అధికారి



శామీర్‌పేట్: మేడ్చల్ జిల్లా, శామీర్‌పేట మండలంలో ఎన్నికల పరిశీలన అధికారి ఐఏఎస్ ప్రియాంక శుక్ల గురువారం పర్యటించారు. మండల పరిధిలోని లాల్‌గడి మలక్‌పేట, తుర్కపల్లి, శామీర్‌పేట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద కల్పించవలసిన వసతులపై అధికారులకు పలు సూచనలు అందించారు. అనంతరం పోలింగ్ కేంద్రం పరిధిలోని బీఎల్‌ఓ లతో ఓటరు స్లిప్ ల పంపిణీ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. శామీర్‌పేట తహసీల్దార్ యాదగిరిరెడ్డి, ఆర్‌ఐ కుమార్, బీఎల్‌ఓ లు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన కార్పొరేటర్లు



జవహర్‌నగర్: బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక సీట్లు సాధిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గురువారం జవహర్ నగర్ కార్పొరేషన్ బీఆర్ఎస్ కార్పొరేటర్లు మేక లలితాయాదవ్, గండి రాంచందర్‌లు తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కీసర: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలో స్వాతి ఎంటర్ ప్రైజెస్ అధినేత సాయి పవన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

మహిళ అదృశ్యం

పోచారం: మహారాష్ట్ర నుండి జీవనోపాధికి వచ్చిన మహిళ అదృశ్యమైన సంఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజు తెలిపిన మేరకు.. మహారాష్ట్రకు చెందిన కడిగి కృష్ణ తన భార్య అనిత (33)తో పాటు జోడిమెట్లలోని స్టార్ బాయ్స్ హాస్టల్‌లో పనిచేస్తూ రెండేళ్ల నుండి అక్కడే ఉంటున్నారు. బుధవారం మధ్యాహ్న సమయంలో షాపునకు వెళ్తున్నానని హాస్టల్ నుండి వెళ్లిన అనిత ఎంతసేపటికీ తిరిగి రాలేదు. కృష్ణ ఫోన్ చేస్తే మొబైల్ స్విచ్‌ఆఫ్ అయినట్లు తెలిసింది. ఎంత వెతికినా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని వెతుకుతున్నారు.

నిత్యావసర వస్తువులు వితరణ



బోడుప్పల్: రిలయబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మేడిపల్లిలోని డిలైట్ ఫౌండేషన్ ట్రస్ట్ నిర్వహిస్తున్న బాలుర, బాలికల వసతి గృహానికి నిత్యావసర వస్తువులను వితరణ చేశారు. ఈసందర్భంగా రిలయబుల్ ట్రస్ట్ డైరెక్టర్ రవి మాట్లాడుతూ వేసవి కాలంలో ఆశ్రమాన్ని సందర్శించి మూడు నెలలకు సరిపడా బియ్యం, పప్పులు, నూనెలు, ఇతర వస్తువులను అందజేసినట్లు తెలిపారు.

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి చేయూత



మల్కాజిగిరి: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తికి మానవసేవే మాధవ సేవ వాట్సప్ గ్రూప్ చేయూత నందించింది. ఆర్‌కెనగర్‌కు చెందిన నిరంజన్ గత మూడు సంవత్సరాలుగా కాలేయ సమస్యతో భాదపడుతున్నాడు. విషయం తెలుసుకున్న గ్రూప్ అడ్మిన్ కుమ్మరిరాజు గ్రూపు తరుపున 10 వేలు చేయూత నందించారు. కార్యక్రమంలో ఉదారి సత్యనారాయణ,నితిన్ ఉన్నారు.

సాయినగర్‌లో కమాన్ వివాదం

కమాన్ దిమ్మెలను తొలగించిన జీహెచ్ఎంసీ అధికారులు



ఆందోళన చేస్తున్న సాయినగర్ కాలనీవాసులు

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, సాయినగర్ కాలనీలో కమాన్ వివాదం నెలకొంది. కమాన్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తు బుధవారం అర్థరాత్రి కాలనీవాసులు ఆందోళనకు దిగి రోడ్డుపై బైఠాయించారు. వివరాల్లోకి వెలితే.. కాలనీలోని ఓ కుటుంబానికి చెందిన వ్యక్తులు తమ కుటుంబీకుల పేరుతో కమాన్ నిర్మించేందుకు పూనుకొని కమాన్ పనులను బుధవారం అర్ధరాత్రి సమయంలో మొదలుపెట్టారు. విషయం తెలిసిన కాలనీవాసులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని కమాన్ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. అనుమతులు లేకుండా చేస్తున్న కమాన్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని నిర్మాణదారులకు పోలీసులు సూచించి కాలనీవాసులకు సర్థిచెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ విషయంపై గురువారం సాయినగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, సీసీఎస్ ప్రతినిధులు కుషాయిగూడ పోలీస్‌స్టేషన్, కాప్రా సర్కిల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



జవహర్‌నగర్: చెన్నాపురం చెరువులో దూకి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని చెన్నాపురం చెరువులో గురువారం గుర్తు తెలియని వ్యక్తి (సుమారు 25-30 వయసు) చెరువులో దూకాడు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నారు.

వడదెబ్బతో యాచకుడి మృతి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లో గుర్తు తెలియని యాచకుడు వడదెబ్బతో మృతి చెందాడు. ఎస్ఐ రాము తెలిపిన వివరాలు ప్రకారం... ఘట్‌కేసర్‌లో భిక్షాటన చేసుకుంటున్న ఓ యాచకుడికి గత నెల 28న వడదెబ్బ సోకింది. పోలీసులు ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆస్పత్రి, అనంతరం గాంధీ ఆస్పత్రికి తరలించారు. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. తనపేరు గంధం హనుమతు, తనది సికింద్రాబాద్ అని తెలిపాడని పేర్కొన్నారు.